క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



పిఠాపురంలో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

కొత్తపల్లి: పిఠాపురంలో ఉన్న సీనియర్ అడ్వకేట్, జిల్లా అధ్యక్షుడు పడాల రవి కార్యలయం వద్ద సోమవారం పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శిఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాపు మోహన్‌గాంధీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి నూకిళ్ల నరసిహమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసా వెంకట రమణ మూర్తి, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు పలివేల వెంకట రమణమ్మ, వైద్యులు బత్తుల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పచ్చారి శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సామర్లకోట: పట్టణంలోని పోలీసు రింగ్ సెంటర్‌లో ఉన్న విమల్ బాట్లింగ్ స్థలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు ఆంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు లింగం శివకుమార్, జిల్లా కార్యదర్శి నేతల హరిబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, స్టేషన్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి గత కౌన్సిల్‌లోనే తీర్మానం అయిందని గుర్తు చేశారు. ఆ తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు.

2న మాండవ్య నారాయణస్వామి కల్యాణం




సామర్లకోటలోని మాండవ్య నారాయణ స్వామి ఆలయం

సామర్లకోట: తుల్య గోదావరి తీరాన భీమవరంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణ స్వామి కల్యాణం జనవరి రెండున జరుగుతుందని ఆలయ అర్చకుడు రఘురామ్ ఆచార్యులు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస పూజలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా జనవరి రెండున స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, లక్ష తులసీ పూజ, అమ్మవార్లకు లక్ష సింధూర పూజ, ఆంజనేయ స్వామివారికి లక్ష తమలపాకుల పూజలు, హోమం జరుగుతాయని చెప్పారు. అదే రోజు రాత్రి స్వామివారి శాంతి కల్యాణం జరుగుతుందని తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా నిర్వహించే మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ కౌన్సిల్ సాధారణ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖలకు చెందిన మున్సిపల్ అధికారులు హాజరు కావాలన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పిఠాపురం మండల కార్యదర్శి, కాకినాడ జిల్లా ఉపాధ్యాక్షుడు కే.సింధు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడు జి.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వతంత్ర్య ప్రజాస్వామ్యం, సోషలిజం అనే జెండాను పిఠాపురం అధ్యక్షురాలు, జిల్లా బాలికల కన్వీనర్ జి.చిన్ని చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్ఎఫ్ఐ ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసి నేటికి 54 పూర్తయి 55 సంవత్సరంలో అడుగు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకాష్, ప్రేమ్ కుమార్, వెంకటేష్, వీవీ రమణ, మహేష్, శశి, సుభాష్, కమల్, సింధు పాల్గొన్నారు.



సంక్రాంతికి విక్రయానికి సిద్ధంగా ఉన్న పందెం కోళ్లు



నెమలి



కాకి నెమలి



డేగ



నెమలి చవల

పందెం కోడీ సిద్ధం

- గ్రామాల్లో కోడి పందాలకు సిద్ధమవుతున్న నిర్వాహకులు
- సంప్రదాయమంటున్న ప్రజలు
- పందెం కోళ్లకు డిమాండ్
- చర్యలు తప్పవంటున్న పోలీసులు

కొత్తపల్లి: తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి. పండగ దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. సంబరాల వేళ భోగి మంటలు, గొబ్బెమ్మలు, రంగు రంగుల ముగ్గులు, హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల సందడితోపాటు సంప్రదాయం పేరుతో కోడి పందాలు ఎక్కువగా నిర్వహిస్తారు. ఈ కోడి పందెలకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. పందాలకు అవసరమైన పందెం కోడి పుంజులకు గత 3, 4 నెలల నుంచి తర్ఫీదు ఇస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే హెచ్చరిక ప్రకటనలు, కోడిపందేల స్థావరాలపై దాడులు, కేసుల నమోదు కొనసాగుతున్నాయి.

పందెం కోడిపుంజులకు డిమాండ్

ఈ సంక్రాంతికి పందెం కోడి పుంజులకు మంచి గిరాకీ ఉంది. జాతి రకాన్ని, రంగును బట్టి రూ.5వేలు నుంచి రూ.1లక్ష వరకూ ధర పలుకుతుంది. పందెం కోడి పుంజులకు రారాజుగా చెప్పుకునే నల్ల చెవళకు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ డిమాండ్ ఉంది. కాకి నెమలి, ఎర్ర నెమలి, కాకి డేగ, పచ్చ కాకి డేగ, డేగ, పండు డేగ, కాకి, పంగళి చవళతో పాటు పలు రకాలు ఉన్నాయి. వీటి డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయిస్తున్నారు.

కోస మాంసానికీ గిరాకీ

ఏటా కోస మాంసానికి డిమాండ్ పేరుగుతోంది. నాలుగైదేళ్ల కిందట మూడు కిలోల కోస మాంసం రూ.1500 నుంచి రూ.2000 వరకూ ఉండేది. కోస మాసం రుచి చూసినవారు వాటి కోసం ఎగబడతారు. అదే సమయంలో పందెంరాయుళ్లు అధికారులకు, అనాధికారులకు, అభిమానులకు, బంధువులకు కోస మాసాన్ని ఇవ్వడంతో మరింత డిమాండ్ పెరిగింది. గతేడాది ఒక్కో కోసను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు విక్రయించారు. ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు, కోస మాంసం ప్రియులు పేర్కొన్నారు.



కోడి పుంజుకు మేత పెడుతున్న పెంపకందారు



భారీగా నిర్వహిస్తున్న కోడి పందాలు (ఫైల్)

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలే..



పోలీసుల చట్ట నిబంధలను అతిక్రమించి సంక్రాంతి పండగలో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం ఇప్పటికే పందాలు, జూదగాళ్లకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసుల నిఘా పెంచాం. సంక్రాంతిని కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలి. ఇప్పటికే కోడి పందేలు వేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. నిబంధనలు అతిక్రమించి పందేలు వేస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడం.

– వెంకటేష్, కొత్తపల్లి ఎస్సై

సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్

ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 16 అర్జీలు అందినట్లు ఆర్డీఓ చెప్పారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉందన్నారు. ఈ వారం అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భాను కుమార్, హౌసింగ్ అధికారి రవిశంకర్, డీవైఈఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

కబడ్డీ అంఫైర్ మురళీకుమార్‌కు స్వాగతం



ఎయిర్‌పోర్టులో మురళీకుమార్‌కు స్వాగతం పలుకుతున్న కబడ్డీ సంఘ ప్రతినిధులు, అభిమానులు

సామర్లకోట: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ అంపైర్ బోగిళ్ల మురళీకుమార్‌కు సోమవారం విశాఖపట్నం ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఇండియాలో జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌లకు 10 పర్యాయాలు అంపైర్ వ్యవహరించడమే కాకుండా, ఈ నెల 28న ఆస్ట్రేలియాలో జరిగిన కబడ్డీ మ్యాచ్‌కు అంపైర్‌గా వ్యవహరించిన ఆయన సామర్లకోటకు చేరుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి ముంబాయిలో దిగి అక్కడి నుంచి విమానంలో విశాఖపట్నం వచ్చిన మురళీకుమార్‌కు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసు ఆధ్వర్యంలో అభిమానులు స్వాగతం పలికారు. విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గంలో రాత్రికి సామర్లకోట చేరుకున్నారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఇండియా-ఆస్ట్రేలియా లెజండర్స్ మధ్య జరిగిన కబడ్డీ మ్యాచ్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి ఏకైక అంపైర్‌గా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉన్నదని ఉమ్మడి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీవీఎస్ శ్రీనివాసు, కోశాధికారి నిమ్మకాలయ కిరణ్, విశ్రాంత జాతీయ కోచ్ పోతుల సాయిప్రసాద్, విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం అన్నారు. ఇండియా నుంచి 10 మంది అంపైర్లు ఆస్ట్రేలియా వెళ్లగా, సౌత్ ఇండియా నుంచి మురళీకుమార్ మాత్రమే ఎంపిక కావడం గమనార్హం. సామర్లకోటకు చెందిన బోగిళ్ల మురళీకుమార్ జగ్గంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

పరిష్కార వేదిక.. అర్జీయే లేదిక..!

- మండల పరిషత్‌లో గ్రీవెన్స్ శూన్యం
- అధికారుల సమయం వృథా!
- కలెక్టర్ పీజీఆర్ఎస్‌కే ప్రాధాన్యమిస్తున్న అర్జీదారులు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ(పీజీఆర్ఎస్)తో ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు. డిసెంబర్‌లో పెద్దాపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీలలిత అధ్యక్షతన గత ఐదు సోమవారాలు గ్రీవెన్స్ ఏర్పాటు చేయగా, ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. అదే విధంగా సామర్లకోట మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన నాలుగు గ్రీవెన్స్‌లోను ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదు. ఆయా గ్రామాలకు చెందిన ఫిర్యాదుదారులు కాకినాడకు వెళ్లి కలెక్టర్‌కు అర్జీలు అందజేస్తున్నారు. కలెక్టర్‌కు అర్జీ అందజేయడం వలన ఆయా అర్జీపై మండల స్థాయి అధికారులను, పంచాయతీ అధికారులను కలెక్టర్ వివరణ కోరే అవకాశం ఉంది. దాంతో అర్జీదారులు తమ సమస్యలపై వ్యయప్రయాసలకోర్చి, కాకినాడకు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందజేస్తున్నారు.

25 అర్జీలు అక్కడే..

సామర్లకోట మండలానికి చెందిన అర్జీదారులు కలెక్టరేట్‌లో డిసెంబర్‌లో 25 అర్జీలను దాఖలు చేశారని, వీటిలో 12 సామాజిక పింఛన్ల కోసం ఉన్నాయని ఎంపీడీఓ హిమమహేశ్వరి తెలిపారు. మిగిలిన 13 అర్జీలలో పదింటిని పరిష్కరించినట్టు చెప్పారు. పనసపాడు గ్రామానికి చెందిన రాయుడు మోజెస్‌బాబు, చంద్రంపాలేనికి చెందిన ఇజ్జన సత్య ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు శ్మశాన వాటికల స్థలాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాలను గుర్తించడానికి పంచాయతీ అధికారులు సర్వే చేస్తున్నారని వివరించారు.

అదే విధంగా పెద్దాపురం మండలంలో కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన ఐదు అర్జీలను పరిష్కరించినట్టు ఎంపీడీఓ శ్రీలలిత తెలిపారు. పింఛన్లకు సంబంధించి ఒంటరి మహిళకు వయస్సు అర్హత లేక పోవడంతో రెండు, దివ్యాంగ పింఛనుకు దివ్యాంగత్వం చాలకపోవడంతో ఒకటి, వృద్ధాప్య పింఛనుకు అర్హత లేకపోవడంతో ఒక అర్జీని పంచాయతీ అధికారులు లబ్ధిదారులకు ఎండార్స్‌మెంట్ చేయాల్సి ఉందన్నారు.

సమయం వృథా

ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి స్పందన లేక పోవడంతో మండల స్థాయి అధికారుల సమయం వృథా అవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆయా శాఖల అధికారులు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరవుతున్నారు. ఫిర్యాదులు ఏమీ రాకపోవడంతో గ్రీవెన్స్‌లో ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫిర్యాదులు రాకపోవడంతో పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు గ్రీవెన్స్‌కు డుమ్మా కొడుతున్నట్టు సమాచారం.



సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఖాళీగా ఉన్న అధికారులు



పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో అరకొర అధికారులతో గ్రీవెన్స్

మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మద్యం, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా గొల్లప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: నూతన సంవత్సర వేడుకల్లో ప్రజలు మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సూర్యానారాయణ అన్నారు. గొల్లప్రోలులో జన విజ్ఞాన వేదిక మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ కాలేజీ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మద్యం వద్ద ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీని తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, గౌరవ అధ్యక్షుడు దాడి పద్మనాభం, కాలేజీ ప్రిన్సిపాల్ గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు అందజేస్తున్న రైతులు

సామర్లకోట: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. పట్టణంలోని సామర్లకోట, భీమవరం ప్రాంతాలకు చెందిన రెవెన్యూ సదస్సును సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. రైతుల భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం, ఆన్‌లైన్‌లో పేర్లు తప్పుగా నమోదు కావడం, మరొకరి పేరున భూమి నమోదు కావడం, సర్వే నంబరు తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డి, రీ సర్వే తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాంజనేయులు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. అంతకు ముందుకు భీమవరంలో తహసీల్దార్ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

గౌరీ నాయుడుకు సత్కారం



నాయుడుని సత్కరిస్తున్న ప్రముఖులు

కొత్తపల్లి: విజయవాడ పట్టణంలో ఉన్న కాకరపర్తి భావన్నానారాయణ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహా సభను నిర్వహించారు. ఈ సభలో పిఠాపురానికి చెందిన యువ సాహితీవేత్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాచకొండ నరసింహ శర్మను, సాహితీ సంస్థల ఉపాధ్యక్షుడు, సోమసుందర్ లిటరరీ ట్రస్ట్ కో ఆర్డినేటర్ కిలారి గౌరీ నాయుడు పాల్గొన్నారు. ఈ మహా సభలో అమరజీవి పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలో నిర్వహించిన సాహిత్య సంస్థల ప్రతినిధుల సదస్సులో పాల్గొని రేపటి మార్పు కోసం సాహితీ సంస్థల కృషి అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. రెండో రోజు ప్రసిద్ధ సాహితీ వేత్త గుంటూరు శేషచంద్ర శర్మ సభావేదికపై నిర్వహించిన యువగళాల కవి సమ్మేళనంలో పాల్గొని పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే అంశంపై రచించిన స్వీయ కవితను కవితాగానం చేశారు. తనకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బద్ద ప్రసాద్, పద్మభూషణ్ ఆచార్య, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌తో పాటు పలువురు చేతుల మీదుగా ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రం అందించారు. నాయుడుని పలువురు అభినందించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



పిఠాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నిరసన

సామర్లకోట: కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను బర్తరఫ్ చేయాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ, దేశ దిశ, దశ నిర్దేశించడంలో అంబేడ్కర్ కీలక భూమిక పోషించారన్నారు. ప్రజలు ఎన్నుకున్న వారే పరిపాలించేలా ప్రజాస్వామ్యయుతమైన రాజ్యాంగాన్ని నిర్మించారని వివరించారు. అటువంటి రాజ్యాంగ నిర్మాతను అవమానించడం అధికార బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. రాజ్యాంగ పదవిలో ఉంటూ, రాజ్యాంగ నిర్మాతను అవమానకరంగా మాట్లాడటం చాలా దారుణమన్నారు. లౌకిక భారతాన్ని కాపాడుకోవడం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడంలో ముందుంటామని చెప్పుకొనే బీజేపీ, ఈ స్ఫూర్తిని తుంగలోకి తొక్కుతోందని దుయ్యబట్టారు. మంత్రి అమిత్ షాను బీజేపీ సమర్థించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే అమిత్ షాను బర్తరఫ్ చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం గోవిందరాజు, కె.ఏడుకొండలు, బాలం హరి, ఐటీ వీరబాబు, కూనిరెడ్డి అప్పన్న, దారపురెడ్డి క్రాంతి, నరసింహమూర్తి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పిఠాపురం: ఇటీవల రాజ్యసభ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం సీపీయం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కరు అనడం కంటే దేవున్ని స్మరించుకుంటే పుణ్యం వస్తుందని చెప్పిన మాటాలు, పదాలు వెనక్కి తీసుకోవాలన్నారు. అంబేడ్కరు కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన వాడు కాదని భారతదేశానికి మహోన్నత వ్యక్తి అన్నారు. రాజ్యంగ రూపంలో ప్రజలకు మాట్లాడే హక్కు, స్వేచ్ఛ, మౌలిక సూత్రాలను విధివిధానాలను ఎవరూ మార్చకూడదని అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ఉపయోగపడే శసనాలు, చట్టాలు చేయాలని ఆ రోజున రాజ్యంగం రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ కె.చిన్న, కోనేటి రాజు, మణి, విశ్వనాథం, గోవిందాచారి, డి.గోపాలకృష్ణ, వి.సూర్యనారాయణ, డి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

పెద్దాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాతను అవమానించడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ.. అమిత్‌షాను సమర్థించడంలో వెనుకాడడం లేదన్నారు. అమిత్‌షాను తక్షణమే బర్తరఫ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, కూనిరెడ్డి అప్పన్న, సిరిపురపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, ఆర్.వీర్రాజు, యాసపుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

కొత్తపల్లి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు రాజనామా చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బేబిరాణి, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు గొడుగు సత్యనారాయణ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ అంబేడ్కరు అనడం కంటే దేవున్ని స్మరించుకుంటే పుణ్యం వస్తుందని చెప్పిన మాటలు, పదాలు వెనక్కి తీసుకోవాలన్నారు. అంబేడ్కరు కేవలం ఒక సామాజిక వర్గానికి చెందిన వాడు కాదని భారతదేశానికి మహోన్నత వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు శ్రీలం అప్పలరాజు, కాళ్ళ నాగేశ్వరరావు, చీకట్ల సాంబశివ, వెల్లకి వజ్రం, శ్రీను, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.